
# మహానగరం కథలు

## -వేదుల సుభద్ర





*మహానగరం కథలు*

**ఢిల్లీ, బొంబాయి, బెంగుళూర్, హైదరాబాదు, లండన్, పారిస్, న్యూయార్క్. పేరేదైనా, స్వదేశమైనా, విదేశమైనా.** ఉన్నది ఎక్కడైనా, తీరు, తెన్నూ ఒకటే.. ఆకాశాన్నంటే మేడలూ. ఇబ్బడి ముబ్బిడిగా పెరుగుతున్న వాహనాలూ, జనాభా, మారుతున్న ప్రజలూ, తరుగుతున్న వనరులూ మానవతా విలువలూ, రోజురోజుకీ చేరుతున్న ఊహకందని మార్పులూ, ఎటువైపో తెలియని జీవన పయనాలు.వెరసి. గజిబిజి బ్రతుకుల ఉరుకుల పరుగులతో .. మహానగరాలన్నీ "యమహా" నగరాలవుతున్నాయి.

కాలుష్యమూ, యాంత్రికీకరణా, మెటీరియలిజమూ, స్వార్థమూ, మనుష్యులమధ్య పెరుగుతున్న దూరాలూ, ఆర్థికసంబంధాలే జీవిత సంబంధాలనుకునే రోజులూ ... ఇవేనా నగరాలలోకనిపించేది? ఇంతకు మించి మరేమీ లేదా? కాదు.. తరచి చూస్తే ఆవేశాలూ, ఆనందాలూ, పురోగమనాలూ, బాంధవ్యాలూ, పోటీ తత్వాలూ, గెలుపిచ్చే సంతోషాలు. పంచుకుంటే పెరిగే సుఖాలూ మాట విరుచుకుంటే మిగలని సంబంధాలూ, వెతలే కాదు.. కతలూ కనిపిస్తాయి..

అత్యంత సంపన్నులూ, అతి నిరుపేదలూ కలిసి ఆకాశమనే ఇంటికప్పుకింద కలిసి చేసే సహజీవనాలే మహానగరాలు. ఓపికుండి వింటే సాలభంజికలని మించి చెప్పే కథా సాగరాలు. నిత్యం మారుతున్న మన రోజువారీ జీవన చిత్రాలు.. ఈ మహానగరం కథలు..!!

# ఆశల గంగ

**"పొద్దున్నే ఫోన్ ఎవరబ్బా??** శ్రూ, కొంచం చూస్తావా?" అంటూనే దుప్పటి నిండా లాగి ముసుగు పెట్టుకున్నాడు శ్రవణ్.

" నువ్వే చూడరాదు? ఐ యాం రియల్లీ టైర్డ్. నీ ఫోనే! నేను మాట్లాడినా నీకే ఇవ్వాలి అది? " అంది శృతి అతని వైపుకు వీపు పెట్టి పడుకుంటూ..

విసుక్కుంటూనే తీసిన శ్రవణ్ ఆశ్చర్యపోయాడు అవతల మాట్లాడుతున్న వ్యక్తి గొంతు విని..

" మీరా? ఎలా వచ్చారు? ఎడ్రస్ సులువుగానే తెలిసింది కదా? వన్ మినిట్,నేను కిందకి వస్తాను" అంటూ లేచి టీ షర్ట్ వేసుకుని గబ గబా నడిచాడు..

" శ్రూ, త్వరగా రా, ఎవరొచ్చారో చూడు" అంటూ పిలిచాడు కిందకు వెళ్ళి అతన్ని తీసుకుని వచ్చాకా.

అతని అరుపులకి ఏమయిందో, ఎవరొచ్చారో? అనుకుంటూ గబ, గబా బయటకి వచ్చిన శృతి కూడా అతన్ని చూసి ఆశ్చర్యపోయింది.. " రాకేష్! ఓ మై గాడ్!" అంటూ .

గుమ్మం బయట నిలుచున్న అతను మొహమాటంగా నవ్వాడు.. చేతిలో చిన్న బాగ్, వీపుకి బేక్ పాక్. అంతే ఉన్నాయి అతని చేతుల్లో

" రాకేష్, మీరా? రండి, రండి. తొందరగానే రాగాలిగారే? " అంది.. ఆ మాటలకి అతనింకా ఇబ్బంది పడ్డట్టుగా నవ్వాడు.

" ముందుగా మీ ఇద్దరికీ నా క్షమాపణలు.. ముందే చెప్పకుండా వచ్చేశాను. పరిస్థితులు అలా వచ్చాయి, అందుకే చెప్పేంత టైము లేకపోయింది. అన్నింటికన్నా ముఖ్యంగా టికెట్ కొంచం చీప్ గా దొరికింది, లక్కీగా" అన్నాడు అతను ఏది ముందు చెప్పాలో, ఏది వెనక చెప్పాలో? తెలియడం లేనట్టుగా..

" అవన్నీ తర్వాత మాట్లాడుకుందాం, ముందు లోపలకి రండి" అన్నాడు శ్రవణ్.

" అవునవును. రండి, టీ తాగుతూ మాట్లాడుదాం" అంది శృతి కూడా..

అతను బెరుగ్గానే లోపలకి వచ్చి కూర్చున్నాడు. ఢిల్లీలోని పేరున్న లొకాలిటీలో అధునాతనంగా ఉన్న ఆ నవదంపతుల ఫ్లాట్ ని ఆశ్చర్యంగా చూస్తున్నాడు. అన్నీ ఎంతో అందంగా పొదికగా సర్ది ఉన్నాయి. అప్పుడతనికి గుర్తొచ్చింది శృతి తను ఇంటీరియర్ డిజైనర్ ని అని చెప్పిన సంగతి..

" మీకు, అంటే మిమ్మల్ని ఇబ్బంది పెడుతున్నాను కదా! కానీ నాకింకెవరూ లేరు ఇక్కడ.. కాదు, కాదు ఉన్నారేమో తెలీదు" అన్నాడు నెమ్మదిగా..

" మీ ఇల్లు చాలా బావుంది" అన్నాడు సోఫాలో కూర్చుంటూ..

టీ, తో పాటు గబ, గబా బ్రెడ్ టోస్ట్ చేసి జాం, బటర్ ల తో తెచ్చింది.

" పొద్దున్నే ఆరుంపావుకి వచ్చింది నా ఫ్లైట్. సామాన్లు లేవు కనక ఎక్కువ ఇబ్బంది అవలేదు" అన్నాడు రాకేష్.

ఎలెక్ట్రానిక్ టూరిస్ట్ వీసా లో వచ్చారా? అడిగాడు శ్రవణ్.

" అవును, బాబా కి అస్సలు బాగోలేదు. అది అసలు కారణం" అన్నాడు రాకేష్. టీ తాగుతూ..

అతనికింకా ఆశ్చర్యంగా ఉంది తను వీళ్ళింట్లో ఉన్నాడంటే నమ్మలేకపోతున్నాడు. అసలెలా కలిసారు వీళ్ళు తనకి? అనుకున్నాడు..

---

సరిగ్గా మూడునెలల క్రితం ....

తమ హనీమూన్ కని మారీషస్ వెళ్ళారు శృతి, శ్రవణ్. వాళ్ళ పెళ్ళి అయి అప్పటికి రెండు నెలలవుతోంది. శ్రవణ్ కి బిజినెస్ పనులుండడం, శృతి కూడా, అప్పటికి తను చేస్తున్న ఒక ప్రాజెక్ట్ మధ్యలో ఉండడం వల్ల పెళ్ళి అయిన వెంటనే వాళ్ళు ఎక్కడకీ వెళ్ళలేకపోయారు.. తమ పనులు ముగించుకుని వారం రోజులు శలవు తీసుకుని, రెండు వారాంతాలు కలుపుకుంటే కలిసి వచ్చే తొమ్మిదిరోజులకి ట్రిప్ ప్లాన్ చేసుకున్నారు..

" ఎక్కడకీ వెళ్ళద్దు మనం, హాయిగా రిసార్ట్ లోనె ఉందాం. హాయిగా ఇక్కడ కూర్చుని టీ తాగుతూ రోజంతా గడిపెయ్యచ్చు" అంది శృతి. ఆమెకంతగా నచ్చింది ఆ రిసార్ట్.

శ్రవణ్ నవ్వాడా మాటలకి. " కంగారేం లేదు! రెండు, మూడు రోజులు అయ్యాకే ఊరు చూద్దాం" అన్నాడు.

మారీషస్ లో దక్షిణాన ఉన్న ఒక మంచి రిసార్ట్ లో దిగారు వాళ్ళు. ఐదు రెస్టారెంట్లు, మూడు స్విమ్మింగ్ పూల్స్, ప్రైవేట్ బీచ్, కావలసినన్ని సరదా కార్యక్రమాలు.. రిసార్ట్ లో చాలా ఎంజాయ్ చేసారు ఇద్దరూ. నాలుగోరోజున హోటల్ వారితో చెప్పి టాక్సీ మాట్లాడుకున్నారు దగ్గరలో ఉన్న విహార స్థలాలు చూడడానికి.

పదిగంటలకి " సార్! మీ టాక్సీ వచ్చింది" అన్న పిలుపు వచ్చింది రిసెప్షన్ నించి శ్రవణ్, శృతిల రూం కి.

ఇద్దరూ బయటకి వెళ్ళారు టాక్సీ ఎక్కడానికి.

"వెల్ కం సార్, వెల్ కం మేడం!" అన్నాడు కార్ డోర్ తీస్తూ అన్నాడు అతను.. ఛామనచాయలో పొడుగ్గా ఉన్నాడతను. యాభై ఏళ్ళుండచ్చేమో !

వాళ్ళిద్దరూ కార్లో కూర్చున్నాకా, "నా పేరు రాకేష్ సార్! ఈ రోజు, రేపు మీతో పాటే ఉండి మీకు ఊరంతా చూపిస్తాను " అన్నాడు అతను ఇంగ్లీష్ లో.

కార్లో ఎక్కాకా గొంతు తగ్గించి నెమ్మదిగా మాట్లాడుకుంటున్నారు శృతి, శ్రవణ్..

" కెన్ ఐ ప్లే మ్యూజిక్ ఫర్ యూ?" అన్నాడు డ్రైవర్..

" ఓ ష్యూర్! " అన్నాడు శ్రవణ్..

వెంటనే అతను ఎఫ్. ఎం ఛానెల్ పెట్టాడు. " దిస్ ఈజ్ మై ఫేవరెట్ ఎఫ్.ఎం ఛానెల్ సర్, బెస్ట్ ఎఫ్. ఎం. దీని పేరు" అన్నాడు చిరునవ్వుతో..

అందరు డ్రైవర్లూ మాట్లాడరు. ఎయిర్ పోర్ట్ నించి తమని తీసుకుని వచ్చిన అతను చాలా తక్కువగా మాట్లాడాడు., ఇతను అలా కాదని అనుకున్నాడు శ్రవణ్.

అతనలా అనుకుంటూ ఉండగానే

" మీకు హిందీ తెలుసా?" అని అడిగాడు అతను..

శ్రవణ్ వెంటనే " అఫ్కోర్స్! మాది ఢిల్లీ" అన్నాడు.

వెంటనే అతను హిందీలో మాట్లాడడం మొదలు పెట్టాడు. అంతే కాక " భలే! అయితే పాత పాటలు, మంచివి పెడతాను "అంటూ తన దగ్గరున్న పెన్ డ్రైవ్ కనెక్ట్ చేసి అందులో ఉన్న పాత పాటలు పెట్టాడు.

" రఫీ సాబ్!! మై ఆల్ టైం ఫేవరెట్ సింగర్.. క్యా అవాజ్ హై సార్?" అన్నాడు..

" నిజమే! అన్నాడు శ్రవణ్.. “నాకు కూడా! ” అంది శృతి ఆనందంగా..

అప్పటినించీ మొదలయింది వారి సంభాషణ.. అతను వాళ్ళని ఊరంతా తిప్పి చూపించిన రెండు రోజులూ అది కొనసాగుతూనే ఉంది.

" మీ పేరు?" అడిగింది శృతి.

" రాకేష్ మేడం.. రాకేష్ భరోసీ" అన్నాడు..

" ఓ ఇందాకా చెప్పారు కదా! సారీ!” అంది ఆమె.

“పర్వాలేదు మేడం!” అన్నాడు అతను..

" అంటే మీరు ఇండియాకి చెందినవారా?" శ్రవణ్ అడిగాడు..

" అవును సార్! నేను నాలుగో తరం ఇండియన్ ని" అన్నాడు రాకేష్..

" వావ్! అయినా మీరింకా హిందీ మర్చిపోలేదా? అమేజింగ్!" అంది శృతి..

ఆ తర్వాత తన వివరాలన్నీ చెప్పాడు. తన ముత్తాత అయిన రాం భరోసీ బ్రిటిష్ వారి కాలంలోనే ఇండియానించి చెరుకు తోటల్లోనూ, ఇతర చోట్లా పని చెయ్యడానికి కూలీలుగా తీసుకుని రాబడ్డ ఇండియన్స్ లో ఒకరనీ, తమది బీహార్ అనీ చెప్పాడు. ఇప్పుడు మారిషస్ లో దాదాపు ఢెబ్బై శాతం ఇండియానించి అలా వచ్చినవారూ, వారి తర్వాతి తరాలే ఉన్నారని చెప్పాడు.

అతనికే కనీసం యాభై సంవత్సరాల వయసు ఉంటుంది. ఇతని ముత్తాతల కాలం, అంటే ఎంత లేదన్నా నూట యాభై సంవత్సరాలయి ఉండాలి. అయినా వాళ్ళు తమ భాషనీ, మూలాలనీ మరిచిపోలేదంటే ఆశ్చర్యం వేసింది శృతికీ, శ్రవణ్ కీ.

అదే మాట అతన్ని అడిగారు..

" అవును సార్! నిజానికి మాది బీహార్ అని మాత్రమే నాకు తెలుసు, అంతకుమించి బీహార్ లో ఏ గ్రామమో, అక్కడ మాకెవరైనా బంధువులున్నారో, లేదో? ఇవేమీ తెలీదు. మాకు తెలిసిందల్లా మేము మారిషస్ కి చెందినవాళ్ళం. ఇంట్లో మన భాష మర్చిపోకూడదని హిందీ మాట్లాడతాము. నా కొడుకు, కూతుర్లకి హిందీ బాగా మాట్లాడడం రాదు. బాగా అర్ధం అవుతుంది, అది నాకు కొంచం బాధగా ఉంటుంది. నాకన్నా ఎక్కువగా మా బాబాకి" అన్నాడు..

" బాబా అంటే మీ ఫాదరా?" అడిగాడు శ్రవణ్..

" అవును సార్, బాబాకి, నాకూ ఎప్పటికైనా ఒక్కసారి ఇండియా వెళ్ళాలని కోరిక.. ఒక్కసారి మా వంశానికి మూలప్రదేశాన్ని చూడాలని కోరిక.. బాబాకైతే గంగలో స్నానం చెయ్యాలని కూడా ఎంతో ఉంది. ఇప్పుడు వయసయ్యి బాగా పెద్దవారయిపోయారు. ఆయన ఎలా వస్తారు అక్కడకి? ఆయన ట్రీట్ మెంట్ కి కూడా బాగానే ఖర్చు అవుతోంది. ఇలాంటి పరిస్థితిలో ఆయన్ని అక్కడకి తీసుకువెళ్ళడం అయ్యేపని కాదు.. కష్టమే!" అన్నాడు నెమ్మదిగా.. అతని గొంతులో బాధ మెదిలింది.

కాసేపు కార్ లో మౌనం. అంతలోనే తేరుకుని అతనే అన్నాడు..

“ముందు మనం టెంపుల్ కి వెళదాం సార్, ఇక్కడ శివుడి గుడీ, దాదాపు నూట పది అడుగుల ఎత్తున్న శివుడి విగ్రహం చాలా బావుంటాయి. ‘గంగా తాలావ్’ అన్న పేరున్న ఏరియాలో ఉంది అది, ఇదిగో.. మీరిక్కడ దిగి ఫోటోలు తీసుకోండి.” అన్నాడు. ఇద్దరూ దిగి శివుడి విగ్రహాన్నీ, గుడినీ చూశారు. ఆ పక్కనే తయారవుతున్న దుర్గ విగ్రహాన్ని కూడా చూశారు.

“శివరాత్రి వస్తోంది కదా, దాదాపు ఆరు లక్షలమంది దాకా వస్తారు ఆ రోజు అందుకే ఈ ఏర్పాట్లు” అని చూపించాడు.

“ దాదాపు అరవైశాతం మందా?” అని ఆశ్చర్యంగా అడిగాడు శ్రవణ్.

" అవును సార్. ఇక్కడ మేము అన్ని పండగలూ చాలా బాగా చెసుకుంటాం. అన్ని మతాల వాళ్ళం ఎంతో హాయిగా, కలిసి మెలిసి ఉంటాం. శివరాత్రి, నవరత్రి, దీపావళి, వినాయక చతుర్ధి హిందువులకి పెద్ద పండగలు.." అంటూ వివరాలన్నీ చెప్పాడు. ఏం చదివాడో తెలీదు కానీ మారిషస్ లో కాస్ట్ ఆఫ్ లివింగ్ గురించీ, పాలిటిక్స్ గురించీ, ఉద్యోగావకాశాలు, చదువుల గురించీ అన్నింటి గురించీ అనర్గళంగా మాట్లాడాడు. వాళ్ళిద్దరికీ ఎన్నో విషయాలు చెప్పాడు.

" మారీచుడిని రాముడు తరిమేస్తే ఎగిరొచ్చి ఈ దీవిలో పడ్డాడని, అందుకే మారీచద్వీపం అనీ, ఆ తర్వాత మారీషస్ అయిందని అంటారు నిజమేనా?" అడిగాడు శ్రవణ్ ( ప్రముఖ రచయిత శ్రీ అమితవ్ ఘోష్ కూడా తన ' సీ ఆఫ్ పాపీస్' అనే పుస్తకంలో ప్రస్తావించారు కూడా– ర)

" అయి ఉండవచ్చు సార్, మాకు తెలిసినంత వరకూ ఈ దీవిని ఆక్రమించుకున్న ఒకప్పటి డచ్ యువరాజు పేరు మీద ఈ దీవికి ఈ పేరు పెట్టారని అంటారు " అన్నాడు అప్పటికే అతను వాళ్ళకి ఆ ద్వీపం యొక్క చరిత్ర చెప్పాడు..

ఆ తర్వాత వాళ్ళని రక, రకాల చోట్లకి తీసుకెళ్ళాడు. వెళ్తున్నంతసేపు ఎన్నో విశేషాలు, కబుర్లూ చెప్తూనే ఉన్నాడు..అతని మాటల వల్ల ఎలాగైనా, ఒక్కసారైనా ఇండియా వెళ్ళాలన్న కోరిక అతని మనసులో ఎంత బలంగా ఉందో ! వాళ్ళకర్ధం అయింది..

అందుకే " మీరెప్పుడూ ఇండియా వెళ్ళడానికి ప్రయత్నించలేదా?" అడిగింది శృతి..

" అన్నీ కలిసి రావాలిగా మేడం! ఇప్పటివరకూ ఒక్కసారి మలేసియా మాత్రం వెళ్ళాను. ఇండియా వెళ్ళడం ఇంకా కలగానే మిగిలుంది నాకు. నాకన్నా ముందు బాబా ని తీసుకెళ్ళాలి అనేది ఇంకా ముఖ్యం నాకు. అయితే దానికొక ప్లాన్ వేశాం నేనూ, బాబా కలిసి.." అన్నాడు ఏదో గుర్తొచ్చినట్టు అతని ముఖం నిండా పరుచుకున్న విశాలమైన నవ్వు.

"ప్లానా? ఏమిటది?" అన్నాడు శ్రవణ్ ఆసక్తిగా..

" అసలీ ఆలోచన బాబాదే.. నా కొడుకు విషాల్ యూనివర్సిటీలో చదువుకున్నాడు.. ఉద్యోగం లో చేరాడు ఈ మధ్యనే. వాడికి బిహారీ అమ్మాయినిచ్చి పెళ్ళి చేస్తే బావుంటుంది కదా? అప్పుడు ఆడపెళ్ళివారింటికి పెళ్ళికి వెళ్ళినట్టు వెళ్ళి మన మాతృభూమిని చూసి రావచ్చు అని " అన్నాడు అతను నవ్వుతూ..

ఎప్పుడో నూటయాభై ఏళ్ళకి ముందే తమ పూర్వీకులు వదిలి వచ్చిన దేశాన్ని ఇంకా తమదిగాభావిస్తూ, ఆ గడ్డ మీద మన్సంతా నిండిపోయిన వారి అభిమానన్ని చూస్తే ఆశ్చర్యాన్ని మించిన భావనేదో కలిగింది శ్రవణ్ కీ, శృతికీ కూడా..

" అందరికీ టిక్కట్లో?" అని నేనంటే..

"మనకి మరేమీ దహేజ్ ( కట్నం) అక్కరలేదు. మన ఆరుగురినీ, మా తమ్ముడు, మరదలినీ పెళ్ళికి ఇండియా తీసుకెళ్ళమందాం చాలు అన్నారు బాబా!" .. అన్నాడు రాకెష్ నవ్వుతూ..

" నిజమే ఐడియా బావుంది కదా!" అంది శృతి తను కూడా నవ్వుతూ..

" అది జరిగేది కాదులే మేడం.. విశాల్ ఇప్పటికే తన క్లాస్మేట్ కాజోల్ ని ప్రేమిస్తున్నాడు. పిల్లల ఇష్టాన్ని కాదనేదేముంది? అయినా ఇప్పుడొక్కసారిగా బీహార్ నించి మనకి పిల్లనిమ్మంటే ఇస్తారా? చెప్పండి. ఇది జరిగేది కాదు, ఎప్పుడో బాబా ఆరోగ్యం కొంచం నెమ్మదించాకా మేమిద్దరం వెళ్ళాల్సిందే!" అన్నాడతను..

ఎన్నో చోట్లకి తీసుకెళ్ళాడు, వాటన్నింటిగురించీ వివరాలన్నీ డబ్బిచ్చి పెట్టుకునే గైడ్ కన్నా ఎక్కువగా చెప్పాడు..

అధాట్టుగా వాన పడితే " దక్షిణాన కొండ ప్రాంతంలో వానలెక్కువ, ఇదిగో గొడుగులు నా దగ్గర ఎప్పుడూ రెడీగా ఉంటాయి" అంటూ గొడుగులిచ్చాడు..

" మీ ఇద్దరికీ నేను ఫోటోలు తీస్తాను. ఎంత సెల్ఫీ తీసుకున్న ఇంతకంటే బాగా ఉండవు" అంటూ ఫోటోలు తీశాడు.

" మీకు ఇక్కడ దొరికినంత బ్రహ్మాండమైన శాకాహారపు భోజనం ఎక్కడా దోరకదు. నాదీ హామీ" అంటూ ఒక చిన్న ఫేమిలీ రెస్టారెంట్ కి తీసుకెళ్ళి చక్కటి భోజనం రుచి చూపించాడు.. తను మాత్రం టిఫిన్ చాలన్నాడు. అతనికి కూడా శ్రవణే డబ్బు ఇస్తే విపరీతంగా మొహమాట పడ్డాడు.

" ఇక్కడకి వచ్చినవారందరూ తప్పకుండా ఈ షిప్ మోడల్స్ ని కొనుక్కుంటారు" అంటూ షాపుకి తీసుకెళ్ళాడు.

" నా తరపున మీకు" అంటూ మంచి సుగంధపు టీ పాకెట్ బహుమతిగా ఇచ్చాడు.

ఒక మనిషిని, అది కూడా కొత్తమనిషిని అభిమానించాలంటే అతను మనకోసం ప్రాణాలిచ్చేసేంత పనో, లేదా మన ప్రాణాల్ని కాపాడేసేంత పనో చెయ్యాలని రూలేమీ లేదు..

అందుకేఅలా రెండు రోజులు తమ స్వంత మనిషిలా తమతో కలిసిపోయి, కబుర్లు చెప్పిన రాకేష్ ని చూస్తే వాళ్ళిద్దరికీ ఎంతో ఆత్మీయంగా అనిపించింది.

ఆ అభిమానంతోనే మర్నాడు అతనికి వీడ్కోలు చెప్తూ

" మీరెప్పుడు ఇండియా వచ్చినా మా ఇంటికి రావడం మర్చిపోకండి" అంది శృతి.

శ్రవణ్ మరొక అడుగు ముందుకువేసి,

" ఇండియా వచ్చేట్టయితే మీరు ముందు ఢిల్లీ రండి, అక్కడనించి పాట్నా వెళ్ళచ్చు, నేను ఊరికే అనడం లేదు, నిజంగా, మనస్పూర్తిగా చెప్తున్నాను.మీకెవరూ లేరుకదా ఇండియాలో? అందుకే అంటున్నాను. ఇదిగో ఇది మా ఎడ్రస్, ఫోన్ నంబర్లు" అంటూ ఇచ్చాడు.. స్వతహాగానే చిన్న విషయాలకి కూడ త్వరగా స్పందించే శ్రవణ్ అలా మాట్లాడడం శృతి కి ఆశ్చర్యం అనిపించలేదు..

భార్యాభర్తలిద్దరూ ఏదో హడావిడి పడుతూ ఉండగా వారితో తనకి కలిగిన పరిచయాన్ని గుర్తు చేసుకున్నాడు రాకేష్..

" మీరు నన్ను క్షమించాలి!" మళ్ళీ అన్నాడు ప్రస్తుతం లోకి వస్తూ..

"క్షమించడం ఎందుకు?" అన్నాడు శ్రవణ్.

" ఏదో మాట వరసకి మీరు ఎడ్రెస్ ఇస్తే నేను మీ దగ్గరకి వచ్చేసి ఇబ్బంది పెడుతున్నాను కదా? మరో దారిలేక ఇలా చెయ్యవలసి వచ్చింది. ఉన్నట్టుంది బాబా కి బాగా ఎక్కువయింది. అసలే పెద్దవయసు, బాగా ఆయాస పడుతున్నారు, ఊపిరితిత్తులు చాలా బలహీనంగా ఉన్నాయన్నారు." అలా అంటున్నప్పుడు రాకేష్ కళ్ళల్లో నీళ్ళు..

ఎప్పుడూ బాబా అనే మాటలే నా మనసులో..

" ఎందుకొచ్చామో తెలీకుండా కూలివాళ్ళల్లా వచ్చాము, అలాగే మనది కాని నేలని, మనదనుకుని, మనదిగా చేసుకుని మనుగడ సాగిస్తున్నాం.. కానీ నా మనసుకెందుకో శాంతి అనిపించదు బేటా! నా తరహాయే నీది. ఎప్పుడూ చూడని ఆ నేల మీద నాకెందుకు ఇంత అభిమానం? మా బాబా కూడా పోలేదు ఎప్పుడూ . ఒక్కసారి వెళ్ళాలని, ఆ గంగ నీరు తాగాలని, అందులో మునక వేసి జీవితాన్ని ముగించాలని ఎందుకింత తాపత్రయం? ఒక్కసారి ఆ నీరు తాగగలనా పోయేలోపల? అన్నారు సార్.

"అప్పుడే!" ఇంక ఆగలేకపోయాను.

"గంగా తాలావ్ నీరు తెచ్చి, అదే గంగ అంటే ఆల్మోస్ట్ కోమా లో ఉన్న తాతకేం తెలుస్తుంది?" అన్నాడు నాకొడుకు..

వాడిది నా తర్వాత తరం, అందుకే వాడికి నేనేమీ సమాధానం చెప్పలేకపోయాను. కానీ నా మనసు ఊరుకోలేకపోయింది.. ఎందుకంటే పేరులో గంగ ఆ చెరువుకి ఉన్నా, అందులో ఉన్నది గంగో, కాదో నాకు తెలీదు. అందుకని అప్పటికప్పుడు బయల్దేరి వచ్చాను. ఎప్పుడో ఒకసారి నా భార్య షర్మిల తో కలిసి విహార యాత్రకి రావాలని అనుకున్నాను, కాని ఇదిగో ఇలా రావలసి వచ్చింది.

బాబా కి ఎంత టైముందో? తెలీదు. ఎవరూ తెలియని దేశంలో ఎక్కడికో వెళ్ళాలా? లేదా దైవం సంకల్పించినట్టు మీరు ఎడ్రస్ ఇచ్చారని, మీకే చెప్పాలా? అని ఆలోచించేంత వ్యవధి కూడా లేదు నాకు. అందుకే ఇలా? ఎదో ఊరికే రమ్మంటే ఇలా వాలిపోయాడనుకుంటున్నారా?" అన్నాడు..

అతనలా వచ్చి తమకి ఇబ్బంది కలిగిస్తున్నాననుకుంటున్నాడని వాళ్ళకర్థం అయింది.. వెంటనే శ్రవణ్ లేచి అతని దగ్గరగా వచ్చి కూర్చుని

" చూడండి రాకేష్! మీరెందుకింతగా ఆలోచిస్తున్నారు ఆ విషయం గురించి? మేము వివరాలు ఇస్తేనే కదా మీరు వచ్చారు? ఇప్పుడు మనం చూడాల్సింది మీరెంట త్వరగా గంగ నీరు తీసుకుని మీ బాబా దగ్గరకు వెళ్తారు అని? నేను ఒక్క గంట ఆఫీసుకి వెళ్ళి వచ్చేస్తాను,ఆ తర్వాత మిమ్మల్ని నా కార్లో ఢిల్లీ కి అతి దగ్గరలో ఉన్న గంగా నది ప్రవహించే ప్రాంతానికి తీసుకెళ్తాను. అక్కడ మీకు కావలసినవన్నీ చేసుకుని, గంగ నీరు తీసుకుని వెనక్కి వచ్చేద్దాం. వీలున్నంత తొందరగా మీరు తిరిగి వెళ్ళచ్చు.. కానీ.." అంటూ ఆగాడు..

" గడ్ ముక్తేశ్వర్ కదా?? గ్రేట్ ఐడియా.. ఇక్కడికి అన్నింటికన్నా దగ్గర అది. ఇంకా కానీ ఎందుకు?" అంది శృతి..

" రాకేష్ తన రాష్ట్రం బీహార్ వెళ్ళలేరేమో, టైము సరిపోదు కదా! లేదూ మీరు పాట్నా వెళ్తానంటే ఆ ఏర్పాట్లు కూడా చూద్దాం. అన్నాడు " అన్నాడు శ్రవణ్..

" పర్వాలేదు సార్. నేను వచ్చిందే బాబా కోసం. ప్రస్తుతం ఆయనకి గంగ తీసుకె ళ్తే చాలు.. చాలు.. నా కొడుకు ఏదో ఒక నీరన్నాడు, నేను కనీసం గంగ తీసుకెళ్ళగలను కదా, అది చాలు.. బాబా పాట్నా గంగ అని చెప్పలేదు కూడా ! అంటూ, మళ్ళీ అంతలోనే, బాబాకి నయమయ్యాకా నేను ఆయనతో కలిసే వెళతాను పాట్నాకి.. అదే మా బీహార్ కి " అన్నాడు రాకేష్..

మూడు ఎయిర్ టైట్ సీసాల్లో గంగనీ, కళ్ళల్లో శ్రవణ్, శృతిల పట్ల కృతజ్ఞతా గంగనీ తీసుకుని తిరుగు విమానం ఎక్కుతూ వారితో అన్నాడు..

" నేను షర్మిలని, బాబా ని తీసుకుని మళ్ళీ తప్పకుండా వస్తాను సార్. ఈ గంగే బాబా కి జీవగంగ అవుతుంది.. " అన్నాడు శ్రవణ్ చేతులుపట్టుకుంటూ. అవునన్నట్టు తల ఊపారు శృతి, శ్రవణ్..

అతని హృదయంలో ఆకాశ గంగ, ఆశలగంగై ఉరకలేస్తోంది!!

COMMENTS